తలుపులు మూసుకుని ఉన్నాయి.

తలుపుల మీద చప్పుడయింది.

తెరుచుకుందామనుకుంటున్నట్లు లోపలనుంచి తలుపులు కిర్రుమన్నాయి.

ఇక ఆగలేమంటున్నట్టు బయట నుంచి తలుపులు దబదబలాడాయి.

బయట నల్లని చీకటి. చిక్కటి చీకటి. తలుపుల కవతల నిలబడిన ఒక ఆకారం చుట్టూ కారు చీకటి.

తలుపు లోపల వెలుగు. చల్లని వెలుగు. కరుణ నిండిన వెలుగు!

శాంతమ్మ తలుపులు తెరిచింది. తలుపులు తెరిచింది శాంతస్వరూపి అయి ఉంటుందన్నట్లు తెరిచింది.

"ఎవరు బాబూ?" ఆవిడ గొంతులో ఎంతో ఆదరణ, ఆర్ద్రత.

"నన్ను పోలీసులు తరుముతున్నారు!" అతని స్వరంలో వణుకుతున్న భయం, తొణుకుతున్న ఆందోళన.

క్షణంపాటు అవాక్కయి అంతలోనే తేరుకుని, "ఇటు రా, బాబూ!" అని పిలిచింది ఆవిడ.

చీకటిలోనుంచి వెలుగులోకి వచ్చా డతను. పీక్కుపోయిన ముఖం, చిక్కులు పడిన జుట్టు, మాసిపోయిన బట్టలు - నిస్తేజంగా ఉన్నాడు. నిరాశ్రయుడిలా ఉన్నాడు. పాతికేళ్లవాడు మరో పదేళ్ల బరువును మీద వేసుకుని మోస్తున్నవాడిలా భారంగా ఉన్నాడు.

"కనపడితే నన్ను కాల్చి చంపేస్తారు!" కదలిపోయేలా అన్నాడు.

పోలీసు లెందుకు తరుముతున్నారని ఆవిడ అడగలేదు. 'వాళ్లు కాల్చి చంపేటంత అపరాధం ను వ్వేం చేశావు' అని అడుగుదామనుకున్నట్లు ఆవిడ చూడలేదు.

"లోపలికి రా!" అని దారి ఇచ్చింది. 'ఇక్కడ నీ కేం భయం లేదు' అన్నట్లు చూసింది.

చటుక్కున లోపలికి వచ్చి గబుక్కున తలుపులు మూసేశా డతను! మండుటెండలోంచి మళ్లీ నీడకు చేరినట్లు గాఢంగా నిట్టూర్చాడు.

చీకట్లో ఉండటమే చేతయినట్లు, వెలుగులో నిలబడటం చేతకానివాడిలా కళ్లు చికిలిస్తూ చుట్టూ కలయజూశాడు. "ఇంట్లో ఇంకెవ రెవరున్నారు?" అతని గొంతులో కంగారు.

"నా కోడలు, మనుమరాలు. అంతే!" ఆవిడ స్వరంలో అభయ ముద్ర.

"మగవాళ్లు?" అతని గొంతులో ఆశ్చర్యం.

"లేరు." ఆవిడ స్వరంలో విషాద రేఖ.

"బయటినుంచి వచ్చేవాళ్లు?" అతని స్వరంలో సందేహం.

"ఎవరూ లేరు. ఎవరూ రారు." ఆవిడ గొంతులో భరోసా.

"మరి మీ కొడుకు?" అతని చూపులో ఉత్సుకత.

"రాలేనంత దూరంలో ఉన్నాడు." ఆవిడ చూపులో నిర్లిప్తత.

అతను అర్థం కానట్టు చూశాడు.

అప్పుడే లోపలి నుంచి "ఎవ రత్తయ్యా?" అంటూ ఓ యువతి బయటకు వచ్చింది.

అపరిచితుడు అదేదోలా ఉన్నాడు. భయపెట్టేలా ఉన్నాడు. బిక్కుబిక్కుమంటూ చూసింది.

ఆమె బోసిపోయిన మెడ అతన్ని కొట్టవచ్చింది. కొడుకు రాలేనంత దూరంలో ఉన్నాడన్న ఆవిడ మాటలకి అప్పు డర్థం స్ఫురించిం దతనికి. నోటమాట రాక నిలబడిపోయాడు.

"ఎవరో అతను ... కష్టంలో ఉన్నాడు!" తనే కష్టంలో ఉన్నవాడు అతను నిన్ను భయపెట్టేది ఏముందమ్మా అని కోడలికి ధైర్యం చెపుతున్నట్లుంది. కష్టంలో ఉన్నవాడికి ఆశ్రయం ఇవ్వాలి సుమా అని హెచ్చరించినట్లుంది.

ఎప్పుడు వచ్చిందో లోపలినుంచి - "అమ్మో! నెత్తురు!" అంది శాంతమ్మ ఏడేళ్ల మనుమరాలు. ఆ పిల్ల భయకంపిత స్వరం ఆ ఆడవాళ్ల గుండె జల్లుమనిపించింది.

అప్పుడే తన కాళ్లవైపు చూసుకున్నా డతను. తన కో పెద్ద గాయం అయిందని అంతవరకు తెలిసినట్లు లేదతను. పోలీసుల బారినుంచి తప్పించుకోవట మొక్కటే లక్ష్యంగా పెట్టుకుని పోగొట్టుకున్న శారీరక స్పృహని అప్పుడే తెచ్చుకున్నట్లున్నా డతను. "అబ్బా!" అన్నాడు కాలు పట్టుకుంటూ.

"దెబ్బ ఎక్కడ తగిలింది బాబూ!" అంటూ శాంతమ్మ అతనికి దగ్గరగా రాబోయింది.

గుమ్మం దగ్గరినుంచి లోపలిదాకా చుక్క చుక్కల్లా పడిన నెత్తుటి బొట్లు చూస్తూ తలుపుల వైపు చూపించా డతను.

శాంతమ్మ గ్రహించింది. "పోలీసులు ఎంత దూరంలో ఉండుంటారు?"

"ఏమో! ఊళ్లోకి వచ్చేదాకా నన్ను తరుముతూనే ఉన్నారు."

కోడలివైపు చూస్తూ, "ముందు గుమ్మం బయట నెత్తుటి మరకలుంటే తుడిచెయ్యాలి. టార్చిలైటు తీసుకురామ్మా లక్ష్మీ!" అని తలుపులు తీయబోయింది శాంతమ్మ.

"వద్దు, తలుపులు తెరవవద్దు!"

అతని భయాన్ని అర్థం చేసుకుంది శాంతమ్మ. "నాకు చీకట్లో సరిగా కనపడదు. నువ్వలా దొడ్లోంచి చుట్టూ తిరిగి వెళ్లి గుమ్మం ముందు నాలుగువైపులా కచ్చావచ్చుగా తుడిచేసి రామ్మా!"

చీపురు తీసుకుని లక్ష్మి బయటకు వెళ్లింది.

"నువ్వలా కూర్చో, బాబూ! నెత్తురు కారకుండా కట్టు కడతాను!" అంటూ స్టౌ వెలిగించి వేణ్నీళ్లు పెట్టడానికి వెళ్లింది శాంతమ్మ.

అతను కూర్చుంటూ ఆ పిల్లవైపు చూశాడు. ఆ పిల్ల వెనకడుగు వేస్తూ బిత్తరగా చూసింది.

భయపడవద్దన్నట్లు నవ్వు తెచ్చిపెట్టుకున్నా డతను.

దేనికి భయపడకూడదో తెలియని వయసు. అపరిచితమైన దానికి ఇట్టే భయపడే వయస్సు. గోడకి బొమ్మలా అతుక్కుపోయింది ఆ పిల్ల.

పక్కకి తిరిగి కూర్చున్నా డతను. ముందుకు వంగి రక్తంతో తడిసిన పాంట్‌ని నెమ్మదిగా పైకి లాగి మడతలు పెట్టడం మొదలుపెట్టాడు. తను పడుతున్న బాధ భరించలేనంతగా ఉన్నా ఆ పిల్ల భయపడుతుందేమోనని పళ్లు బిగపట్టాడు.

శాంతమ్మ వచ్చింది. "అబ్బో! గాయం పెద్దదే! తుపాకి గుండు తగిలి చీరుకుపోయినట్లుంది."

"అవును. పోలీసులు ఒక్కసారిగా మామీద పడ్డారు. మా వాళ్లు ముగ్గురు దొరికిపోయారు. తక్కినవాళ్లం తుప్పల్లోకి పారిపోయాం. పోలీసు తుపాకులు మా మీద గుళ్ల వర్షం కురిపించాయి. ఎంతమంది బతికి బయటపడ్డారో నాకు తెలియదు. ఇక్కడదాకా ఎలా రాగలిగానో నాకు తెలియదు. మీ తలుపు సందులోనుంచి వెలుగు కనిపించింది. ఇక పరుగెత్తలేక మీ తలుపు తట్టాను."

"మంచిపని చేశావు!" అని అల్మైరాలోనుంచి దూదిగుడ్డ తీసుకువచ్చి అతని గాయం మీద ఒత్తుగా పెట్టి కట్టు కట్టింది శాంతమ్మ.

"మీ రెంత మంచివాళ్లు!" అతని గొంతులో గాద్గదికత.

"నీ పేరు బాబూ?" ఆవిడ చిరునవ్వులో నైర్మల్యం.

"నా పేరు నే నెప్పుడో మర్చిపోయాను!" అతని

# ఎన్‌కౌంటర్

తటవర్తి రామచంద్రరావు

నిట్టూర్పులో నిరాశ.

"మనస్సులో దిగులుగా ఉన్నప్పుడు అన్నీఅలాగే అనిపిస్తాయి."

"దిగులు, ఆనందం అంటూ వేరే వేరే ఏమీ లేవు మాకు. మేము నమ్మింది ఆచరణలో పెట్టడంమీదనే మా దృష్టి."

"మీరు నమ్మింది ఏమిటి బాబూ?" ఆవిడ గొంతులో కుతూహలం.

"సమాజంలో సమానత్వం. పేద, గొప్ప అన్నవి ఉండకూడదు !" అతని గొంతులో గాంభీర్యం.

"అంటే? ..." అని అర్ధోక్తిలో ఆగిపోయింది ఆవిడ.

"అవునమ్మా! మీరంతా విప్లవవాదులని వింటూంటారే - వాళ్లల్లో నేనూ ఒకణ్ని."

ఓ క్షణం గదిలో నిశ్శబ్దం.


"ప్రభుత్వం దృష్టిలో నేను నేరస్థుణ్ని. నేరస్థుణ్ని పట్టించి ప్రభుత్వాని కప్పగించాలా, గాయపడ్డ మనిషిని రక్షించాలా అని సందిగ్ధంలో పడ్డారు కదూ !"

"లేదు, లేదు !" శాంతమ్మ నవ్వులో కంగారు.

"మీరు సందేహించడంలో తప్పేమీ లేదమ్మా! మేమంతా బందిపోటులమని, కిరాతకులమని, రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. అది నమ్మే వాళ్లెవరైనా మమ్మల్ని చూసి భయపడతారు, అసహ్యించుకుంటారు. కాని నిజానిజాలు ఎందరికి తెలుసు?" అంటూ ఎన్నో విషయాలు అనర్గళంగా, ఆవేశంగా చెప్పుకుపోయా డతను.

"అడవులు కొట్టేసి కలపను దొంగతనంగా అమ్ముకుంటూ ఆదివాసుల్ని నిరాధారం చేస్తున్నారు కాంట్రాక్టర్లు. గిరిజన భూముల్ని ఆక్రమించుకుని వాళ్లని తన్ని తగలేస్తున్నారు ముఖాసాదార్లు. కష్టానికి సరిపడ కూలి డబ్బులివ్వకుండా రైతు కూలీలను కాల్చుకు తింటున్నారు భూస్వాములు. వీళ్లను శిక్షించి పేదవాళ్లకి న్యాయం చేయాల్సిన పోలీసులు వీళ్లదగ్గరే లంచాలు పుచ్చుకుని పేదవాళ్లని దొంగకేసుల్లో ఇరికించి హింసిస్తున్నారు. ఈ దేశంలో డబ్బున్నవాళ్లదే రాజ్యం. డబ్బున్నవాడికే న్యాయం. అది అన్యాయం అని పోరాడేవాళ్లు విప్లవకారులు. 'మీ హక్కుల్ని తెలుసుకోండి' అని గిరిజనుల్ని ఆదివాసుల్ని సంఘటితం చేస్తున్నవాళ్లు నక్సలైట్లు. అదే భరించలేకపోతున్నారు పెత్తందార్లు. వాళ్లిచ్చిన చందాలతో సభ్యత్వాన్ని చేజిక్కించుకున్న రాజకీయ నాయకులు వాళ్లని బంగారుబాతుల్లా రక్షించుకుంటున్నారు. అందుకే ప్రజల్లోని ఆర్థిక అసమానత్వాన్ని పోగొట్టవల్సిన ప్రభుత్వం - ఆ పని మానేసి అది కావాలని అడిగినవాళ్లని అణగదొక్కే కార్యక్రమాన్ని చేపట్టింది.

"ఇది అన్యాయమని పోరాడుతున్నందుకు మమ్మల్ని పట్టుకుని కాల్చి చంపుతున్నారు. ఈవేళ దొరికిపోయిన ముగ్గుర్ని చెట్లకి కట్టేసి అక్కడికక్కడే





కాల్చి చంపేశారు పోలీసులు." అన్నా డతను.

"అయ్యో! అరెస్టు చేయవచ్చు కదా! కాల్చి చంపట మెందుకు?" అంది శాంతమ్మ.

"అరెస్ట్ చేస్తే కేసులు పెట్టాలి. సాక్ష్యాలు కావాలి. కోర్టులో వాదనలు జరిపించాలి. కాంట్రాక్టర్ల దగ్గర, షావుకార్లదగ్గర కుత్సితంగా లంచాలు తిన్న పోలీసులు వాళ్ళ రహస్యాలు బయటపడే పని ఎప్పుడూ చేయరు. మమ్మల్ని చంపేసి కేసు ల్లేకుండా చూసుకోవటమే వాళ్ళకి కావాల్సింది. పోలీసు ఎన్‌కౌంటర్లో ఎదురు కాల్పుల్లో తీవ్రవాదులు చచ్చిపోయారని పేపర్లలో ప్రజలు చదువుకుంటూంటారు చూశారా, అదిగో ఆ చావులు ఇలాగే ఉంటాయి."

ఆవిడ కన్నార్పకుండా చూసింది.

"మా శవాన్ని అనాథ ప్రేతాలని ఎక్కడో అడవుల్లో తవ్వి పాతేస్తారు. ఆ పని చేసినందుకు ప్రభుత్వం పోలీసులకి వీర పతకాలు చదివిస్తోంది!"

ఆవిడ అప్రతిభురాలైంది.

"కాని, మాకు చావంటే భయం లేదు. ఏ రోజునైతే ఈ ఉద్యమంలోకి దిగామో, ఆ రోజునే మమ్మల్ని ఎప్పుడూ మృత్యువు వెంటాడుతూ ఉంటుందని మాకు తెలును. కాని, చచ్చిపోయేలోగా ఎంతోకొంతమందికి మంచి చేయాలి. పేదవాళ్ళకి కొందరికైనా మంచి జరగాలి. అదే ఆలోచన. అదే ఆరాటం."

నీ తల్లిదండ్రులెవ్వరూ, నువ్వెక్కడివాడివి అని ఇంకా ఏవేవో అడగాలనుకుంది ఆవిడ.

అంతలో దొడ్లోంచి పరుగుపరుగున వచ్చింది లక్ష్మి. "అత్తయ్యా! వీధి చివర టార్చిలైట్లు. ఎవరో వెతుక్కుంటూ వస్తున్నారు. పోలీసుల్లా ఉన్నారు."

గబుక్కున పైకి లేచి అడుగు వేయలేక అక్కడే కూలబడిపోయా డతను.

ఊపిరిబిగపట్టి అంతా విన్నారు.

బయట బూట్ల చప్పుళ్ళు.

"ఇదిగో, రక్తం. ఇక్కడే ఎక్కడో ఉన్నాడు సార్!" ఒక్క పోలీసు వాడి గొంతు.

"అయితే వెతకండి! పట్టుకుని, కాల్చి చంపండి నా కొ...." ఇన్‌స్పెక్టర్ కాబోలు అరిచాడు.

"వాళ్ళే పోలీసులు!" అంది లక్ష్మి భయంతో వణికిపోతూ.

"అమ్మో!" అని ఆ పిల్ల అరిచింది.

కుర్చీలో కూర్చున్నవాడు ఒక్క గెంతు గెంతి ఆ పిల్ల నోటికడ్డంగా తన అరచేతి నదిమిపెట్టాడు. తన రెండో చేత్తో తన జేబులోనుంచి పిస్తోలు బయటకు తీసి, "అరిస్తే చంపేస్తాను!" అన్నాడు హుంకరిస్తూ.

అత నంత కఠినంగా ఉండగలడని ఊహించలేకపోయిన లక్ష్మి "నా బిడ్డ తప్ప నా కెవరూ లేరు. దాన్నేం చేయకండి, బాబూ! మీకు దండం పెడతా!" అంటూ అతని కాళ్ళమీద పడి ఏడవసాగింది.

శాంతమ్మ అతని ముఖంలోకి పరిశీలనగా చూసింది. అతను భయపడుతున్నవాడు! భయపెట్టేవాడు కాదు! "ఉష్!" అంటూ కోడలిదగ్గరికి వచ్చి భుజం తట్టి, ఆమెను నోరు మూసుకోమన్నట్టు సంజ్ఞ చేసింది.

అతని చేయి పట్టుకుంది. ఆవిడ వెంట కుంటుకుంటూ లోపలి గదిలోకి నడిచా డతను. ఆ పిల్ల నలాగే తన కూడా లాక్కుపోయాడు.

ఆవిడ సంజ్ఞ చేసింది. అతను పట్టెమంచం కిందకి దూరిపోయాడు. అతని పట్టు విడిపించుకోవాలని ఆ పిల్ల గింజుకుంది. అతను తన పట్టు వదలిపెట్టలేదు.

"నీ కేం భయం లేదు. ని న్నేమీ చేయడు! పోలీసులు వెళ్ళిపోయాక వద్దుగాని, అందాకా ఇక్కడే ఉండు, బుజ్జీ!" అని మనుమరాలితో చెప్పి, వాళ్ళు బయటకు కనపడకుండా వాళ్ళమీద తుంగచాప పరిచేసి ట్రంకుపెట్టెలు ముందుకు లాగి అడ్డుగా పెట్టేసింది.

వీధి తలుపులు దబదబలాడాయి.

లక్ష్మి లోపలి గది తలుపులు మూసేయబోయింది.

వద్దని కోడల్ని వారించింది శాంతమ్మ.

తలుపులు తీయక తప్పదు. తీశాక పోలీసులు ఇల్లు సోదా చేయక మానరు. మూసిన తలుపులు ముందే రహస్యాన్ని బయటపెడతాయి.

'ఎలా అతన్ని రక్షించాలి' అన్నదొక్కటే ఆవిడ ఆలోచన.

తలుపుల దగ్గర్నుంచి లోపలికంటా వచ్చిన రక్తపు చుక్కల్ని తుడిచివేయటానికి తడిగుడ్డ పట్టుకుని వెళ్ళబోయింది లక్ష్మి. గబుక్కున కోడలి చెయ్యిపట్టుకుని ఆపింది శాంతమ్మ.

అత్తగారు ఎందు కాగమందో తెలియక వెలతెలబోతూ చూసింది లక్ష్మి.

"తలుపులు తెరవండి!" బయట కేకలు. తలుపుల మీద చప్పుళ్ళు.

అత్తగారివైపు చూసింది లక్ష్మి. అప్పుడే తలుపులు తెరవ వద్దన్నట్టు కోడలికి సంజ్ఞ చేసి, గబుక్కున వంటింట్లోకి వెళ్ళింది శాంతమ్మ. అత్తగారు అలా ఎందుకు వెళ్ళిందో అర్థం కాక, అయోమయంగా చూస్తూ నిలబడిపోయింది లక్ష్మి.

మరుక్షణంలో తిరిగివచ్చి గబుక్కున నేలమీద కూలబడిపోయింది శాంతమ్మ. ఆమె కుడిపాదం నుంచి చివ్వున నెత్తురు చిమ్ముతోంది!

అత్తగా రెంత పనిచేసిందో అర్థమయ్యేసరికి లక్ష్మి ప్రాణాలు కడగట్టిపోయినట్టయ్యాయి. "అత్తయ్యా!" అంటూ గుడ్ల నీళ్ళు కుక్కుకుంది.

"ను వ్వేం మాట్లాడకు! వెళ్ళి తలుపు తియ్యి!" అందావిడ నిశ్చలంగా.

లక్ష్మి వెళ్ళి తలుపులు తీసింది. ముగ్గురు పోలీసులు లోపలికి తోసుకుంటూ వచ్చారు. నేలంతా చిందిన రక్తపు బొట్లమీద తమ బూట్ల కాళ్ళతో తొక్కుకుంటూ వచ్చారు.

"ఎన్నిసార్లు తలుపులు బాదాలి? వినపడటంలేదా?" అని అరిచాడు - పోలీసు ఇన్‌స్పెక్టర్ కాబోలు!

లక్ష్మి గజగజలాడిపోయింది.

"క్షమించండి, బాబూ! ఇప్పుడే బజారునుంచి వచ్చాము. పెద్దదాన్ని చీకట్లో కళ్ళుకనపడలేదు. గాజుపెంకు కోసుకుపోయినట్టుంది. నా రక్తం చూసి కోడలు పిల్ల కంగారుపడిపోయింది. కట్టు కడదామని దూదీ, గుడ్డ తీసుకురావటానికని వెళ్ళింది. ఆలస్యమైనందుకు క్షమించండి!" అంది శాంతమ్మ తొణక్కుండా.

గతుక్కుమన్నారు పోలీసులు. వీధిలో రక్తపు మరకలు చూసి మనిషి దొరికాడని మహదానందంగా తలుపులు తట్టారు వాళ్ళు. వాళ్ళనుకున్న దొకటి, అయింది వేరొకటి. ఏమడగాలో మర్చిపోయిన వాళ్ళలా ముఖాముఖాలు చూసుకున్నారు.

"ఇంట్లో కూర్చోబెట్టటానికి తగినన్ని కుర్చీలు లేవు, క్షమించండి!"

"మేం కూర్చోటానికి రాలేదు!" ఇన్‌స్పెక్టర్ ముఖంలో వినుగు.

"అంతా తిరిగి తిరిగి అలసిపోయినట్టున్నారు."

అత్తగారి మాట కర్థం తెలిసినదానిలా గబగబా వంటింట్లోకి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చింది లక్ష్మి. ముందు అక్కర్లేదన్న ఇన్‌స్పెక్టర్ కూడా గబగబా నీళ్ళు తాగేశాడు.

"పాపం, బాగా దాహం వేసినట్టుంది!" అంది శాంతమ్మ.

'ఓవైపు తన గాయం నుంచి రక్తం కారుతున్నా పట్టించుకోకుండా తమకు మర్యాదలు చేస్తుందేమిటి ఈవిడ?' చిత్తయిపోయిన పోలీసులు మామూలు ప్రశ్న లడగటం మర్చిపోయారు.

ఇక ఆగలేకపోయాడే ఏమో, "ముందు మీ అత్తగారికి కట్టు కట్టమ్మా! రక్తం పోతోంది!" అన్నా డొక పోలీసు.

కన్నీళ్ళు తుడుచుకుని దూది తెచ్చి అత్తగారికి కట్టు కట్టటానికి కూర్చుంది లక్ష్మి.

"ఎవరినో వెతుక్కుంటూ వచ్చినట్టున్నారు!" అంది శాంతమ్మ తొణక్కుండా.

ఇన్‌స్పెక్టర్ ముఖంలో కరకుతనం తగ్గింది. "చూడండమ్మా! ఈ నక్సలైట్ల దుండగాలకి అంతులేకుండా పోతోంది. ఎప్పుడు ఎవరిని

---

## బాలీవుడ్ బాణీ



### మనీషా విలాసం!

మనీషా కొయిరాలా మద్యపానం కథ సీరియల్స్‌గా పత్రికలకు ఎక్కి పరువు పోవడంతో ఆమె ఆ అలవాటుకు స్వస్తి పలికింది - కనీసం అందరికీ కనిపించేటట్టు తాగటంలేదు. కానీ అల్లక్కడ దక్షిణాఫ్రికాలో సెటిలయిపోయిన నంవన్న సింధీ యువకుని మత్తు మాత్రం ఆమెని వదలటం లేదుట. ఈ మధ్య అతగాడు ఇండియాకు వస్తుంటే ఎయిర్‌పోర్టుకి వెళ్ళి మరీ స్వాగతం పలికి వచ్చింది మనీషా! సో వాట్! నచ్చిన వాడికి ఆమె స్వాగతం పలకకూడదంటారా?

-మసూద్ అన్సారి

ఎత్తుకుపోతారో తెలియదు. ఎవరిని కాల్చి చంపుతారో తెలియదు. ఎక్కడ బాంబులు వేస్తారో తెలియదు. పట్టుకోటానికి దొరకరు. పట్టుకోకపోతే మా పై అధికారులు మా ప్రాణాలు తీస్తున్నారు. ఇక్కడికి దగ్గర్లో ఓ ముఠావాళ్ళు మకాం వేశారని తెలిసింది. రెండు రోజులనుంచి పుట్టా చెట్టూ అనక వెతికాం. కొందరు దొరికారు. కొందరు దొరికినట్టే దొరికి పారిపోయారు."

శాంతమ్మ కోడలివైపు చూసింది. ఆమె ముఖం ఎర్రగా కందిపోయి ఉంది.

"కొంద రీ ఊరి వైపు పారిపోయి వచ్చారు. వాళ్ళల్లో ఒకడు తుపాకి గుండు తగిలి రక్తం ఓడ్చుకుంటూ ఇటే వచ్చాడు. ఇక్కడే ఎక్కడో దాక్కున్నాడు" అంటూ ఇటూ అటూ చూశా డొక పోలీసు.

"మీ రన్నది నిజమే! నేనూ, కోడలు బజారుకి వెళ్ళి వస్తున్నాము. అప్పుడే మా గుమ్మం దగ్గరికి వచ్చినట్టున్నాడు. మమ్మల్ని చూసి కంగారుపడి పక్కసందులోకి పారిపోయాడు. అలా ఎందుకు వెళ్ళాడో అర్థం కాకనే నేను దొడ్లోకి వెళ్ళాను. అప్పుడే కాలి కి దెబ్బ తగిలింది. ఆడవాళ్ళం. ఒంటరిగా ఎక్కడికని వెళ్ళగలం? ఇలా లోపలికి వచ్చాం, మీరు తలుపులు కొట్టారు!"

పోలీసులు ఉస్సురుమన్నారు.

"మా ఇళ్ళకి దగ్గర్లో మామిడి తోట లున్నాయి. ఆ పైన అంతా పొలాలు. ఈ చీకట్లో ఎటైనా పారిపోయుండొచ్చు!" అంది శాంతమ్మ.

"వదండి!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మీకేమైనా అనుమానంగా ఉన్నవాళ్ళు కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కి రిపోర్టు చేయండి!" అన్నా డొక పోలీసు కానిస్టేబుల్.

"అలాగే బాబూ!" అంది. శాంతమ్మ.

'చాలా తెలివిగా మాట్లాడాను సార్!' అన్నట్టు చూశాడు కానిస్టేబుల్. ఇన్‌స్పెక్టర్ ముఖం చిట్లించుకుని బయటకు నడిచాడు.

మరునిముషంలో అక్కడంతా నిశ్శబ్దమైపోయింది.

• అత్తగారు నంజ్ఞ చేసింది. కోడలు తలుపులు వేసి వచ్చింది.

"ఎంత పని చేశా రత్తయ్యా!" అంది లక్ష్మి ఉస్సురుమంటూ.

ఆవిడ గాఢంగా నిట్టూర్చింది.

"మీ కాలి కింత దెబ్బ తగిలించుకున్నారే! రేపేదైనా ప్రమాదం జరిగితే?"

ఆవిడ వల్పగా నవ్వింది. "ఏమీ కాదు, వెళ్ళు! వెళ్ళి అతన్ని పిలు!"

"విప్లవకారులు మంచివాళ్ళు కాదని తెలిసి కూడా మీ రెందు కీ పని చేశారు?"

"ఎవరు మంచివాళ్ళు, ఎవరు చెడ్డవాళ్ళు అని మనం నిర్ణయించలేమమ్మా! పుట్టిన ప్రతివాడిలోనూ కొద్దో, గొప్పో మంచితనం అన్నది ఉంటుంది. ఆ మంచి పోకుండా కాపాడటం మన ధర్మం!"

"మీకు లోకంలో అంతా మంచివాళ్ళుగానే కనిపిస్తారు!" అంది లక్ష్మి విసుక్కుంటూ.

శాంతమ్మ చిన్నగా నవ్వి "అతన్ని పిల్చుకురా! ఆ మంచం కింద బుజ్జి కూడా నలిగిపోతోంది!" అని కోడలికి గుర్తుచేసింది.

లక్ష్మి వెళ్ళింది.

అతను బయటకు వస్తూనే, "ఆ పిల్ల అరుపులకి కంగారుపడి పిస్తోలు చూపించి భయపెట్టాను. నన్ను క్షమించండి!" అన్నాడు.





## ఐశ్వర్యా ? మజాకా ?

ప్రపంచ సుందరి ఐశ్వర్యారాయ్ సన్నీ డియోల్‌ను 'ఛీ' కొట్టిందట! కొత్త దర్శకునితో తాము స్వంతంగా తీస్తున్న చిత్రంలో హీరోయిన్ వేషాన్ని వేయమని సన్నీ ఆమెను కోరాడు. కొత్తగా రంగ ప్రవేశం చేసే వారికి ఆ పాత్ర అంత మంచిది కాదని భావించిన ఐశ్వర్య 'సారీ' చెప్పేసింది. ఇప్పటిదాకా వేషం దొరికితే చాలనుకునే వాళ్ళనే చూసిన సన్నీకి ఐశ్వర్య 'నో' పెద్ద దెబ్బ కొట్టేసింది!

- మసూద్ అన్సారి

తన బిడ్డను వాటేసుకుని అతనివైపు అసహ్యంగా చూసింది లక్ష్మి.

"మీరు చేసిన మహోపకారానికి మా అత్తగా రేం చేశారో చూడండి!" అంది నిష్ఠూరంగా.

అప్పుడు కాని శాంతమ్మ కాలివైపు చూడలేదు అతను. "ఏమిటది? ఏం చేశారు?" అని ఆత్రుతగా అడిగాడు.

"ఏమీ లేదు. ముందు నీ గాయాన్ని శుభ్రం చేసి, మందు వేసి కట్టు కట్టాలి!" అంటూ వేణ్ణీళ్ళు తీసుకురావటానికి వంటింట్లోకి వెళ్ళింది శాంతమ్మ.

అతను. అడక్కుండానే అత్తగా రేం చేసిందో చెప్పి, 'మీ రావిడ త్యాగానికి అర్హులా' అన్నట్టు చూసింది లక్ష్మి

అఘాతం తగిలినవాడులా కుర్చీలో కుప్పగా కూలిపోయా డతను.

శాంతమ్మ వేణ్ణీళ్ళతో వచ్చింది.

"ఎందుకమ్మా ఇంతపని చేశారు?" అతని కళ్ళనిండా నీళ్ళు.

ఆవిడ నిర్మలంగా నవ్వింది. "ఏమైతే నేం గండం గడిచింది. అదే మనకి ముఖ్యం. ఈ దెబ్బ ... రేపటి కదే పోతుంది!"

ఆవిడ ఓదార్పు మాటలు అతన్ని మూగవాడిని చేశాయి. తనకు తాను చేసుకున్న గాయాన్ని మర్చిపోయి అతని గాయానికి శుశ్రూష చేస్తున్న ఆ ప్రేమమూర్తిని చూస్తూ అతను కొయ్యబారిపోయాడు.

"బాగా అలసిపోయినట్టున్నావు. ముఖం కడుక్కుని రా! కొన్త అన్నం తిందువుగాని."

"వద్దమ్మా! వద్దు! ఇప్పటికి మీరు చేసింది చాలు! ఇక మీ మీద భారం పెట్టను. సెలవిప్పించండి!" అని పైకి లేచి నిలబడలేక కూలబడిపోయాడు.

"చూశావా! నిలబడటానికే శక్తి లేనివాడికి నడిచే శక్తి ఎక్కడుంటుంది? ఈ రాత్రికి ఇక్కడే ఉండి కొన్త విశ్రాంతి తీసుకో!"

అత నా రాత్రే కాదు. మరో రెండు రాత్రు లక్కడే ఉండిపోవాల్సివచ్చింది.

మర్నాడు పొద్దుటికి శాంతమ్మకి కాలు మోపుచేసి విపరీతంగా జ్వరం వచ్చింది. లక్ష్మి డాక్టర్ని తీసుకువచ్చి వైద్యం చేయించింది.

"నా వల్ల మీరంతా ఇబ్బందుల్లో పడ్డారు" అన్నా డతను.

లక్ష్మి మాట్లాడలేదు.

"మీకు నా మీద చాలా కోపంగా ఉందని నాకు తెలుసు."

అతనివైపు తలతిప్పి కూడా చూడలే దామె.

"మీకు నేను చేయగలిగే సాయ మేమీ లేదు. మీ కింకా భారంగా ఇక్కడ ఉండటమూ నా కిష్టం లేదు. కానీ, నా ప్రాణాలు కాపాడాలని తన ప్రాణాలమీదకు తెచ్చుకున్నా రీవిడ. ఈ స్థితిలో వదిలి ఎలా వెళ్ళగలను?"

అతనితో మాట్లాడకుండా ఉందామని అనుకున్నా భోజనంవేళ అతన్ని పిలవక తప్పలే దామెకు.

ప్రతిపూటా భోజనం పెట్టి వెళ్ళిపోతుం దామె. అతనికి మళ్ళీ ముఖం చూపించదు. తిన్నా ననిపించుకుని లేచి వెళ్ళిపోతున్నా డతను. శాంతమ్మ జ్వర తీవ్రతలో స్పృహ లేకుండా ఉంది. ఇల్లు వదలి వెళ్ళలేదు. ఇంట్లో మాట్లాడేవాళ్ళు లేరు. జీవితంలో అత నిటువంటి చిత్రమైన శిక్షను ఎప్పుడూ అనుభవించలేదు.

మూడోనాడు రాత్రి శాంతమ్మకు కొంచెం జ్వరం తగ్గుముఖం పట్టింది.

ఆవిడ దగ్గరకి వచ్చి "ఎలా ఉందమ్మా?" అని అడిగాడు.

"బాగానే ఉంది, బాబూ!"

"మీ కేదైనా అయితే నే నేమైపోయేవాడ్నో చెప్పలేను!"

"నీ కేమవుతుంది? మంచి మనసున్నవాడివి. నలుగురికి మంచి చేయాలనుకుంటున్నవాడివి. నీకు మంచే జరుగుతుంది."

"మీ రింత అభిమానంగా చూసుకుంటున్నారే! మీ కోడలికి నే నంటే అంత కోపం ఎందుకమ్మా! నే నేం చేశానని? తన పిల్లని పిస్తోలుతో భయపెట్టినందుకేనా నా కింత శిక్ష?"

"నీ మీద కోపం కాదు బాబూ! తనకు వచ్చిన కష్టానికి బాధ! అంతే!"

"మీ రనే దేమిటో నా కర్థం కాలేదు."

"ఆ గోడమీద ఫోటో కనపడుతోందా! వాడే నా కొక్కగా నొక్క కొడుకు. ఈ ఇంటికి మగ దిక్కు వా డొక్కడే! ఎవరి కష్టాన్నీ ఓర్చుకోలేకపోయేవాడు. 'అమ్మా! భగవంతుడు మనిషిని ఎందుకు పుట్టించాడో తెలుసా? ఏదో ఒక మంచి చేయాలని. ఎవరికో ఒకరికి మంచి చేయాలని. అనంతమైన కాలంతో పోలిస్తే మనిషి బతికేది చాలా తక్కువ.

ఆ తక్కువ వ్యవధిలోనే త్వరత్వరగా మంచన్నది చేసుకుంటూ పోవాలి' అనేవాడు. నేను నేడో రేపో రాలిపోయేదాన్ని. జీవితమంతా ముందే ఉంది నా కోడలికి. తన కో చిన్నపిల్ల. వా ళ్లెలా బతకాలి? వాళ్ల కర్మకొదిలేసి తను వెళ్లిపోయాడు. ఎవరో స్నేహితుడు కష్టంలో ఉన్నాడంటే వెళ్లాడు. మళ్లీ తిరిగి రాలేదు" అంది శాంతమ్మ విషాదం నిండిన స్వరంతో.

"ఏం జరిగింది? మీరు చెప్పేది నాకు సరిగా అర్థం కాలేదు" అన్నా డతను.

"మీ విప్లవకారులు కాకతీయ ఎక్స్‌ప్రెస్ మీద బాంబులు వేసినప్పుడు ఆ ప్రమాదంలోనే చచ్చిపోయాడు నా కొడుకు..." ఆవిడ గొంతు బొంగురుపోయింది.

అతనికి తలమీద పిడుగులు పడినట్టయింది.

పొంగి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ ముఖాన్ని చాటుచేసుకుంది ఆవిడ.

చాలాసేపటిదాకా ఆ గదిలో నిశ్శబ్దం గూడుకట్టింది.

"అమ్మా! మీ కోడల్ని ఒకసారి పిలవండి!" అని అడిగాడు అతను.

"ఎందుకు?" చిత్రంగా చూస్తూ అడిగింది శాంతమ్మ.

"నా పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటాను!" అతనే వెళ్లి లక్ష్మిని పిల్చుకుని వచ్చాడు. తన జేబులోని పిస్తోలు తీసి ఆమె ముందు పెట్టాడు.

"మీ భర్త మరణానికి కారకుల్లో నేనూ ఒకడ్ని. ఈ పిస్తోలుతో నన్ను కాల్చి చంపండి. లేకపోతే పోలీసు రిపోర్టు ఇవ్వండి. బాంబులు వేసింది నేనే నని ఒప్పుకుంటాను. మీ రెలాంటి శిక్ష విధించినా నాకు అభ్యంతరం లేదు" అన్నాడు నిశ్చలంగా.

లక్ష్మి వెలతెలబోతూ చూసింది.

శాంతమ్మ పైకి లేచి కూర్చుంది. "ఏమిటి బాబూ! ఏమిటంటున్నావు నువ్వు? రైలుబండి మీద బాంబులు వేసింది నువ్వా? ఊహు! నువ్వు అలాంటివాడివి కావు! అలాంటివాడివి కాలేవు!"

"ఆ బాంబులు పడకుండా ఆపలేకపోయినవాడ్ని నేను అపరాధినే నమ్మా! నాకు శిక్ష పడవల్సిందే!" అంటూ తన చేతులతో ముఖం కప్పుకుని నేలమీద కుప్పలా కూలిపోయా డతను.

శాంతమ్మ మంచం మీద నుంచి లేచి వచ్చింది.

## చిట్టిగాడి లీలలు




"నువ్విలా నానుస్తూ చేస్తే అవతల వాన తగ్గిపోయే ప్రమాదముంది. వానలో తడుస్తూ ఇంటికి వెళ్తే చక్కగా తలంటుపోసుకోనక్కరలేదు ..."

"మంచినీళ్లు తేమ్మా!"

లక్ష్మి నీళ్లు తెచ్చిచ్చింది.

"ఇంద, నీళ్లు తాగు బాబూ!" అంది ఆవిడ అతన్ని బుజ్జగిస్తూ.

"మీ అభిమానానికి తగనమ్మా! న న్నసహ్యించుకోండి. కొట్టండి, చంపండి!" అన్నాడు తన నుదురు కొట్టుకుంటూ.

"చూడు, బాబూ! అందరి భారాన్నీ నువ్వు మోయవద్దు. నీకు నువ్వు శిక్ష వేసుకుని కూడా ప్రయోజనం లేదు!"

ముఖం తుడుచుకుని శాంతమ్మ వైపు కన్నార్పకుండా చూడసాగా డతను.

"... బస్సుల్ని తగలపెట్టడం వల్ల, రైళ్లమీద బాంబులు వేయడం వల్ల అన్నెంపున్నెం తెలియని అమాయకులు చచ్చిపోతున్నారు. దేశానికి సంబంధించిన సంపద దగ్ధమవుతోంది. ఎవరికీ కష్టనష్టాలు లేని శాంతి మార్గం లేనే లేదా? ప్రజలకు మంచి చేయాలనుకునేవారు ఆ ప్రజలు ఒప్పుకునే మార్గంలో వెళ్లాల్సిన అవసరం లేదా? ప్రజలు పాలుపంచుకోకుండా మీ ఉద్యమాలు విజయవంత మవుతాయని ఎలా అనుకుంటున్నారు? హింసవల్ల ఎవరికి ప్రయోజనం జరుగుతోంది? మీరు చేస్తున్న త్యాగాలన్నీ బూడిదపాలై పోవటంలేదా? ప్రజలు అసహ్యించుకునే పరిస్థితులు ఎందుకు తెచ్చుకుంటున్నారు? మీ వేళ్లతో మీ కళ్లే పొడుచుకుంటున్నారే - ఎంత పిచ్చివాళ్లయ్యా మీరు!"

తన కొడుకు దారుణ మరణానికి కారకులైన వాళ్లకి కూడా మేలు జరగాలని ఆశిస్తోంది ఆవిడ! ఎంత గొప్ప మనసు!

"నలుగురికి మంచి కావాలని ఆశించేవాడివి. తప్పుదారిని నడుస్తున్న వాళ్లను మంచిదారిన నడిపించు! నా కొడుకు ప్రాణ త్యాగాని కో ప్రయోజనం చేకూర్చినవాడి వవుతావు!"

అతను అప్రయత్నంగా ఆ ప్రేమమూర్తి పాదాలు స్పృశించి పైకి లేచాడు.

శాంతమ్మ కన్నుల్లోంచి కురుస్తున్న వెన్నెల ముందు గదిలోని దీపాల వెలుగు వెలవెలబోయినట్టనిపించిం దతనికి.

వీధి తలుపులు తెరిచా డతను. లోకంలో ఇక దేనికీ భయపడనన్నంత ధైర్యంగా తెరిచా డతను.

మెట్లు మీదకి దిగుతూ వెనక్కి తిరిగి ఆవిడ వైపు చూశాడు.

ఆవిడ కన్నులనిండా కరుణ నిండిన వెలుగు!

ఇప్పు డతని గుండెల నిండా మంచిని నింపిన వెలుగు!

అతను చీకట్లోకి అడుగులు వేస్తున్నాడు.

ఆ చీకటి ఎల్లకాలం ఉండదులే అని అతని లోలోపల వెలుగుతున్న మానవత అతనికి దారి చూపుతోంది!

[ఈ కథానికలోని పాత్రలు, సంఘటనలు కేవలం నాచే కల్పితములు. ఎవరినీ ఉద్దేశించి రాయలేదు.

- రచయిత]

## "తెలుగు ప్రేక్షకులతో నాది విడదీయరాని అనుబంధం!"

- అంటూంది గ్లామర్ తారగా పేరు పొందిన నగ్మా.

"నేను బొంబాయి అమ్మాయిని కాబట్టి గ్లామరస్ పాత్రల్లో బాగుంటానని అందరూ అటువంటి పాత్రలే ఇస్తున్నారు. 'గ్లామర్ హీరోయిన్'గానే ప్రేక్షకులూ చూస్తున్నారు. కాని ఏమాత్రం నటనకు అవకాశమున్న పాత్ర లిచ్చినా తప్పకుండా చేస్తాను. మెగా స్టార్ చిరంజీవి గారితో నటించిన 'ఘరానా మొగుడు'లో . గ్లామర్‌తోపాటు నటనకూ ప్రాధాన్యమున్న పాత్ర లభించింది.

"నన్ను తెలుగు తెరకు పరిచయం చేసింది దివ్యభారతి. ఆమె ఈనాడు లేకపోయినా, ఆమెకు నే నెంతైనా ఋణపడే ఉన్నాను. సరైన సమయంలో తెలుగు సినీ రంగంలో ప్రవేశించాను. ఆనాడు తెలుగు తెరకు 'రాంగ్ ఎంట్రీ'ని అయి



ఉంటే ఈనాడేమూల ఉండేదాన్నో!

"ఉత్తరాది అమ్మాయినైనా నన్ను దక్షిణాదిలో అందరూ అభిమానిస్తున్నారు. తెలుగు ప్రేక్షకులైతే, నా ప్రతి చిత్రమూ చూసి ఎంతో అభిమానంతో ఉత్తరాలు రాస్తుంటారు. వారి అభిమానం అనే బంధంలో నా కెంతో ఆనందం కలుగుతూంది. వారి ఆశీర్వచనాలతోనే కొత్త కొత్త ఆఫర్లు లభిస్తున్నాయని నా విశ్వాసం.

"కొంతకాలం క్రితం విడుదలైన 'ప్రేమికుడు', ఇటీవల పేరు పొందుతున్న 'బాషా' చిత్రాలు నాకు మరింత పేరు తెచ్చి పెట్టాయి. 'బాషా' డబ్బింగ్ చిత్రమైనా, నాకు ఎంతో గుర్తింపు లభించింది. తెలుగు ప్రేక్షకుల అభిమానం, ఆశీస్సులు నా కెల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను" అన్నది నగ్మా.